కథ

# జవాబులేని ప్రశ్నలు

-కె.బి.కృష్ణ

''హమ్మయ్య - వచ్చి పడ్డాంరా దేవుడా. అన్నింటికీ ఆలీశెం చేస్తావురా చిన్నోడా. మీరంటే ఎట్టాగొచ్చినా ఫర్లేదు. నేనొకత్తిని, అవిటిదాన్ని వుండాను గందా. నన్ను మొయ్యాల, ఎక్కించాల'' అంటోంది ముసలమ్మ. ఆమె వయసు డెబ్బై పైనే. రెండు కాళ్ళు చచ్చుబడినట్లున్నాయి. దేకుతూంది.

భార్యాభర్త కలిసి ముసలమ్మను మెట్ల దగ్గర కూలేశారు. వాళ్ళకు ఇద్దరు పిల్లలు. పది పన్నెండేళ్ళు వుంటాయి. భార్యాభర్త మధ్య వయస్కులు. వాళ్ళ బట్టల్లో పేదరికం తాండవిస్తోంది.

''అమ్మా ఈ బండైతే మనం టిక్కెట్ కొనక్కర్లేదు ఎలాగో వచ్చి పడ్డాం. ఈ రైలులో అయితేగాని నేను అనుకున్న పనులు చక్కబెట్టుకోలేను'' అంటున్నాడు అతను.

భార్యాభర్త ఒక సీటుమీద కూర్చున్నారు. పిల్లలిద్దరూ చెరో కిటికీ దగ్గర కూర్చుని సంతోషంతో బయటకు వింతగా చూస్తున్నారు. ముసలమ్మ రెండు సీట్లకు మధ్యన చతికిలబడింది.

''పైకెక్కించమంటావా? అట్టా కూచుంటావా?'' అన్నాడు.

''వద్దులే. నేనెట్టా వుంటే ఏముందిలే. పిల్లకాయలకు ఏదైనా కొనిపెట్టు. పొద్దుగాల నుండి తిండిలేదు'' అంటూ సణుగుతూంది ముసలమ్మ.

''సర్లే'' అంటూ తమ వెంట తెచ్చుకున్న ఖాళీ ఎరువుల సంచి మూట ముసలమ్మ దగ్గర పెట్టాడు.

సాయంత్రం నాలుగున్నర అవుతోంది. విజయవాడ రైలు స్టేషన్ నుండి, కాకినాడ వెళ్ళే ఫాస్ట్ ప్యాసెంజర్ కూత కూసి కదిలింది. నేనూ కంగారు కంగారుగా అప్పుడే రైలు ఎక్కాను చివర బోగీలో.

''సమోసా రూపాయికి ఒకటీ -''

''చార్ చిల్లీ బఠానీ మసాలా -''

''ఉడకబెట్టిన బాదం పల్లీ-''

''అరటి పళ్ళు -'' వగైరాలన్నీ కంపార్ట్‌మెంట్‌లో అమ్మకానికి వస్తున్నాయి. ఒక్కో రకం వచ్చినప్పుడల్లా పిల్లలు ఆకలితో వాటి వేపు చూస్తున్నారు. కొనమని తమ తల్లిదండ్రుల వేపు అభ్యర్థనగా చూస్తున్నారు.

''పిల్లలకి ఏదైనా కొనకూడదూ - ఆశగా చూత్తున్నారు'' అంది భార్య.

''చాల్లే ఊరుకో - అమ్మ కోసం పైసలు వుంచాను. వాటిలోంచి తియ్యను'' అన్నాడు భర్త.

''చాల్లే సంబడం. రెండ్రూపాయలు పెట్టి సమోసాలు కొంటే ఏమౌతాది?'' అంటూంది. ఎదురుగా జరుగుతున్న ఈ సంభాషణ నా చెవిలో పడింది. సమోసా వాడిని పిలిపించి రెండు సమోసాలు కొని పిల్లలకు ఇచ్చాను.

''ఎందుకయ్యా కొన్నారు ఋణమైపోతుందయ్యా మీతోని'' అంటోంది ముసలమ్మ.

''ఫర్లేదులే - పిల్లలు పాపం ఆకలితో వున్నారు'' అన్నాను. వాళ్ళు సమోసాలు తినే విధానం చూస్తుంటే, ఏదైనా తిని ఎన్ని రోజులైందో అనిపిస్తోంది. ఆబగా, ఆకలితో సమోసాలు అయిపోతాయేమోనన్నట్టుగా వాటిని చూసుకుంటూ తింటున్నారు.

వాళ్ళ ఆకలికి నా మనసు జాలితో నిండిపోయింది. కల్లోలమైపోయింది హృదయం. ఇలా ఆకలితో అలమటించిపోయే వాళ్ళు భారతదేశంలో ఎంత మంది వున్నారో ఎంత మందికి నేను ఆకలి తీర్చగలను? నా మనసును నేనే ఓదార్చుకున్నాను.

''మామ్మా ఏ ఊరు వెళ్తున్నారు?'' అని అడిగాను.

''ఏ ఊరని చెప్పాలయ్యా. మా ఊళ్ళో బ్రతికి చెడ్డోళ్ళం. కనీసం కూలి పని కూడా దొరక్క, దొరికినా సిగ్గుతో చేయలేక పూలమ్మిన చోట కట్టెలమ్మలేక కట్టుబట్టలతో బయలెల్లాం బాబూ. రెండు సంవత్సరాల బట్టి మమ్మల్ని పేదరికం నంజుకు తినేసిందయ్యా. తెలియని చోట కూలిపని చేసుకుందామని బయలెల్లాం బాబూ'' ముసలమ్మ చీరతో కళ్ళు తుడుచుకుంది.

కొడుకు, కోడలు ఏదో సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. మామ్మ నాతో మాట్లాడుతుంటే ఆమెను కోపంతో చూస్తున్నారు. రాత్రి ఎనిమిది కావస్తోంది. నిడదవోలు స్టేషన్ వస్తోంది. ఎవరైనా, ఏదైనా తింటుంటే పిల్లలు వాళ్ళకేసి ఆబగా చూస్తున్నారు. గుటకలు మింగుతున్నారు. జాలేసింది నాకు.

రైలు నిడదవోలులో ఆగాక, దిగి, పెరుగు పొట్లాలు కొనితెచ్చి అందరికీ ఇచ్చాను. ''తినండి ఎందుకని అడగకండి'' అంటూ బలవంతంగా వాళ్ళ చేతుల్లో పెట్టాను. విజయవాడలో మా అన్నయ్య ఇచ్చిన పలావ్ పాకెట్స్ కూడా తినాలనిపించ లేదు.

పిల్లలు కునికిపాట్లు పడుతున్నారు. ఒక సీటు మీద తల ఆన్చుకుని ముసలమ్మ కూడా నిద్రపోతోంది ఈలోగా.

ముసలమ్మ కొడుకూ కోడళ్ళ సంభాషణ నా చెవిన పడింది. కళ్ళు మూసుకునే వినసాగాను.

''మరేం చేద్దామనుకుంటున్నావ్. ఎక్కడకు వెళ్దాం?''

''ఎక్కడికేముంది. నా చిన్నతనంలో గోదావరి తల్లి ఒడిలో పెరిగాను. ఆమె ఒడిలోనే ఇప్పుడు కుటుంబంతో సహా వాలిపోతాను. ఆమె కడుపులో పెట్టుకుంటుంది.''

''రాజమండ్రిలో దిగుదామా - రాజమండ్రిలో ఎవరూ లేరు కదా.''

''పిచ్చిదానా. కొవ్వూరు స్టేషన్ రాంగానే పిల్లల్ని లేపు. గోదారి బ్రిడ్జి మీంచి ముందు పిల్లల్ని గోదార్లోకి తోసేస్తాను. తరువాత నువ్వు, ఆ తరు వాత నేను ఆ తల్లిని తలచుకోవడమే. ఇక మంచి రోజులు రావు. మనల్నె వరూ కాపాడలేరు. కూలి పని చేసు కుని, అభిమానం చంపుకుని మనం బ్రతకలేం.''

''.......''

''ఏం మాట్లాడక. నీకు ఇష్టం లేదా.''

''నువ్వు పిల్లలు దూకితే నేను మాత్రం ఏం చేస్తాను. నిన్ను నమ్ముకుని వచ్చాను. నీతోపాటే మరి మీ అమ్మ?''



(గ్రాఫిక్స్: భాస్కర్)

''మా అమ్మను చంపడానికి నాకు హక్కు లేదు. నన్ను కన్నది, పెంచింది. కొన్నాళ్ళు ఆమె వలననే పది మందిలో గౌరవంగా బ్రతికాం. జన్మజన్మలకు అమ్మ ఋణం తీర్చలేని నేను ఆమెను ఎలా చంపగలను? ఇలా రైల్లోనే వదిలేస్తే ఏ ధర్మ ప్రభువో ఆదుకుంటాడు. తీరా రైల్లో అడుక్కు తింటూ కాలక్షేపం చేస్తుంది'' అంటున్నాడు భర్త.



జీవితం జూదం కాదు. ఎందుకంటే జూదంలో చాకచక్యంగా ఆడితే గెలవాలనుకుంటే ఎప్పుడూ గెలవ వచ్చును. కాని జీవితంలో ఎంత తెలివిగా, చాకచక్యంగా, మెళకువగా ఆడినా వోడిపోక తప్పదు



ఒక్కోసారి. కాని జీవితంలో ఓడిపోయిన వాళ్ళందరూ చావునే కోరుకుంటారు ఎందుకో. ఆ చావు సహజంగా కావాలనుకున్నప్పుడు రాదు కాబట్టి ఆత్మహత్యే శరణ్యమవుతుంది చాలా సందర్భాలలో.

వాళ్ళ సంభాషణ నా మనస్సును కలచివేసింది. అందర్నూ చనిపోవాలనే అనుకుంటారు బాధలు చుట్టుముట్టినప్పుడు. కాని చనిపోరు. నేను 'చచ్చిపోతాను, నేను చచ్చిపోతాను' అన్నవాడెవరూ ఇంతవరకు చనిపోలేదు. మరణం తీసుకుని రావాలి. వాళ్ళూ అంతే. కంగారులో, బాధల్లో ఏదో తప్పుడు నిర్ణయం తీసుకుంటున్నారు. బహుశా వాళ్ళు నిర్ణయానికి కట్టుబడి వుండరేమో.

నాకు నిద్రపట్టేసింది, కూర్చునే నిద్రపోయాను.

నా కాళ్ళు పట్టుకుని ఊపుతుంటే లేచాను. కళ్ళు తెరవగానే ఎదురుగా ముసలమ్మ.

''అయ్యగారూ అన్యాయం జరిగిపోయింది. అబ్బాయి, కోడలు, పిల్లలు గోదావరిలో దూకేశారయ్యా. నన్ను కాళ్ళు చేతులు కదలకుండా కట్టేశారయ్యా. అరిస్తే పోలీసులు వస్తారని నోరు కట్టేశారయ్యా - నేను దిక్కులేని దానిని అయిపోయానయ్యా'' అంటూ ముసలిది గోలుగోలున ఏడుస్తోంది. అయితే నేను విన్న భార్యాభర్తల సంభాషణ నిజమైందా? జీవితం అంటే అంతే అనుకున్నవి జరగవు కదా.

''మామ్మా అసలు ఏం జరిగింది. ఎందుకు ఇలా చేశారు మీ అబ్బాయి, కోడలు.''

''అయ్యా మా అబ్బాయి నాలుగు ఎకరాలు పొలం ఎగసాయం చేస్తున్నాడయ్యా. రెండు సంవత్సరాల నుండి ఇంట్లో సామాన్లు, సొమ్ములు అన్నీ అమ్మేసి ఎరువులు, పురుగు మందులు వేసి పండిస్తున్నాడయ్యా. మా కడుపులు నిండలేదు సరికదా, ఇంట్లో వస్తువులన్నీ అయిపోయాయి. ఎరువులు, పురుగుమందులు, పురుగుల్ని, చీడల్ని తినకుండా మమ్మల్ని తిన్నాయయ్యా'' ముసలమ్మ కన్నీటికి వరదొచ్చినట్టుగా ఏడుస్తోంది.

ఎంతటి కఠిన నిర్ణయం తీసుకున్నారు వాళ్ళు. సమాజంలో బ్రతికి పోరాడలేక, మృత్యువే శరణ్యం అనుకున్నారు వాళ్ళు. ఇలాంటి బాధితులను ఎంతమందిని గోదారితల్లి తన కడుపులో దాచుకుందో లెక్కలేదు. రైలు గోదావరి బ్రిడ్జి చివరకు వస్తోంది. నేను రాజమండ్రిలో దిగాలి.

''అయ్యా నన్ను కూడా గోదార్లోకి తోసెయ్యండి మీకు పుణ్యం వుంటాది. నా కొడుకుతో పాటే నేను వెళ్ళిపోతాను'' ముసలమ్మ ఆక్రోశిస్తోంది.

''తప్పు మామ్మా. బలవంతంగా ఏ మనిషీ చావకూడదు. మీ అబ్బాయి, కోడలు మాట్లాడుకోవడం విన్నాను. నిన్ను వదిలేసి గోదాట్లో దూకుదామని అనుకున్నారు. కాని అన్నంత పనీ చేస్తారని నేను అనుకోలేదు. ఈలోగా నిద్రపట్టేసింది. నన్ను నిద్రలేపక పోయావా.''

''బాబూ నా చేతులు, నోరు కట్టేసి నన్ను కదలనియ్య లేదయ్యా..ఎలాగో కట్టు విప్పుకుని తమర్ని లేపాల్సి వచ్చింది. అప్పటికే అంతా అయిపోయింది.''

ఎంతటి కసాయి నిర్ణయం. ఆకలి, అభిమానాన్ని, ప్రేమను హత్య చేసింది. ఆకలి అనురాగాన్ని వంచన చేసింది. ఆకలి అమ్మను బ్రతికించింది. అదే ఆకలి అమ్మను దూరం చేసింది. అమ్మ కావాలంటే, అమ్మకోసం, ఆకలితో పోరాడాలి. జీవితమంతా పోరాడాలి. అందుకని అతను మృత్యువును ఆహ్వానించాడు.

రాజమండ్రి స్టేషన్‌లో రైలు ఆగంగానే ముసలమ్మను దింపి రిక్షా ఎక్కించి, రిక్షావాడికి యాభై రూపాయలు ఇచ్చి, ముసలమ్మను గోదావరి వొడ్డున వున్న గౌతమీ జీవకారుణ్య సంఘంలో దిగబెట్టమన్నాను.

''ధర్మ ప్రభువులు. పిల్లా పాపలతో చల్లగా వుండాల'' అంటూ నా కాళ్ళు పట్టుకోబోయింది. రిక్షా ఎక్కిస్తుంటే చేతిలో ఇరవై రూపాయలు పెట్టాను.

''ముసలమ్మ - దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కు. ఈరోజు రైల్లో నా ఎదురుగా మీరు ఎందుకు కూర్చున్నారు. లేకపోతే నా పరిస్థితి ఏమయ్యేది? రాజమండ్రిలో గౌతమీ జీవకారుణ్య సంఘం నీలాంటి వాళ్ళను చేరదీసి ఆశ్రయం కల్పిస్తోంది. ఈ రకంగా దేముడు నీకు సాయం చేశాడు వెళ్ళు'' అంటూ నా దారి పట్టాను.

నేను మెలకువగానే వుంటే వాళ్ళు బ్రతికి వుండేవారేమో?

వాళ్ళు బ్రతికి వుంటే ఏం చేసేవాళ్ళు?

మరి ముసలమ్మో?

నేను వాళ్ళని ఆపగలిగి వుండేవాడినా?

ఇలాంటి చచ్చు ప్రశ్నలు మనిషి జీవితంలో ఎన్నో వేసుకుంటూ వుంటాడు.

వీటికి జవాబులు వుండవు.

**హీరో అయితేనేం? విలన్ అయితేనేం?**



అంటున్నాడు జాకీ ష్రాఫ్. అతగాడికి హీరో ఛాన్స్‌లు లేకపోవడంతో విలన్ పాత్రలు కావాలని కోరి మరీ చేస్తున్నాడని ముంబై అంతా ఒకటే మాట. 'అదంతా అబద్ధం, వెరైటీ కోసం చేస్తున్నానే గానీ, హీరో ఛాన్స్‌లు లేక కాదు' అని జాకీ చెబుతున్నాడు. ఏమిటో అతగాని సమస్య.